క్లుప్తంగా

సాయినాథుడికి అభిషేకాలు


సుదర్శన వరాహహోమం చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా నగరంలోని గాంధీచౌక్ శ్రీ వరప్రదాత షిర్డీసాయి మందిరంలో శనివారం సాయినాథుడికి పెరుగు, గోధుమలతో అభిషేకం చేశారు. అనంతరం సుదర్శన వరాహ హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని హర్కారా బావి రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో ఐశ్వర్య ప్రాప్తి సిద్ధించాలని కోరుతూ ఆవు నెయ్యితో బాబా వారికి అభిషేకం చేశారు. అనంతరం నవ గ్రహ పాశుపత హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం చైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, చౌడవరపు మధుసూదన్‌రావు, కొడుమూరి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌పై సమగ్ర విచారణ జరిపించాలి

నేలకొండపల్లి: జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ నిర్వహించిన పరీక్షలలో జరిగిన అక్రమాలపై కేంద్రం సిగ్గుపడాలని కాంగ్రెస్ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్‌లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ నిర్వహించిన అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా నీట్‌పై ప్రధాని మోదీ మౌనం వీడి, నీట పేరుతో దోచుకుంటున్న దొంగల భరతం పట్టాలని తెలిపారు. బీజేపీ అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని సూచించారు.

కొండచిలువ హతం

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలో శనివారం యువత, విద్యార్థులు కలిసి ఖాళీ స్థలంలో వాలీబాల్ ఆడుతున్నారు. కొట్టిన బాల్ కోసం ఓ యువకుడు వెళ్లగా.. చెత్తలో దాదాపు 7 అడుగుల వరకు కొండ చిలువ కనిపించింది. దీంతో అక్కడున్న వారంతా దాన్ని చంపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

ఖమ్మంక్రైం: ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీసిటీ ప్రాంతానికి చెందిన శిరీష శనివారం పనిమీద ఆటోలో వచ్చి మయూరిసెంటర్‌లో దిగింది. ఈక్రమంలో తన సెల్‌ఫోన్‌ను ఆటోలో మర్చిపోవడంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో స్టేషన్‌లో ఉన్న ఏఎస్‌ఐ అమీర్‌అలీ, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, దేవేందర్‌లు చాకచక్యంగా వ్యహరించి ఆటో డ్రైవర్ కృష్ణారావుతో మాట్లాడి ఆమెకు అప్పగించారు. ఈమేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌బాబు వారిని అభినందించారు.

స్తంభించిన ట్రాఫిక్

ఖమ్మంక్రైం: నగరంలోని ప్రధాన రహదారి వైరారోడ్డులో శనివారం ట్రాఫిక్ స్తంభించింది. ఆ రోడ్డులో ఓ బంగారు దుకాణం ప్రారంభం కానుండడంతో పాటు దాని ప్రారంభానికి సినీ హీరోయిన్ సంయుక్తమీనన్ రావడంతో ఆమెను చూడడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను చక్కదిద్దటానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కామేపల్లి ఎస్సైగా సాయికుమార్

కామేపల్లి: కామేపల్లి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సాయికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం వన్‌టౌన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై కామేపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక కార్యకలాపాలు, జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అనంతరం సీఐ తిరుపతిరెడ్డిని ఎస్సై మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

నిబంధనలు పాటించాలి

నేలకొండపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై తోట నాగరాజు సూచించారు. శనివారం మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా రోడ్డుపై నిలుపుతున్న వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నేర రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ జోరు..!

సండే స్పెషల్

గతంలో ఎవరైనా ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే ముందుగా జేబు లేదా పర్స్ చూసుకునే వాళ్లు. రాను రాను పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకుని సెల్‌ఫోన్ ఉంటే ఎటు వెళ్లినా ఏమి కొనుగోలు చేసినా డిజిటల్ చెల్లింపులు చేయొచ్చనే అభిప్రాయం ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతోంది. చిన్న దుకాణాల దగ్గర నుంచి షాపింగ్ మాళ్ల వరకూ నగదు రహిత లావాదేవాలు జరగడంతో మార్కెట్‌లో డిజిటల్ జోరు ఊపందుకుంది. అంతేకాక సమయం ఆదా అవడంతో పాటు నగదు చెల్లింపులు కూడా సులభం అవుతుందని వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నారు.



దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన వివిధ కంపెనీల స్కానర్లు

నగదు రహిత చెల్లింపులకే జనం మొగ్గు

- రోజు రోజుకూ పెరుగుతున్న వినియోగం
- చిన్న దుకాణం నుంచి షాపింగ్ మాల్ వరకు వాడకం
- సమయం ఆదా.. నగదు చెల్లింపు సులభం
- దుకాణాల్లో అందుబాటులో క్యూఆర్ కోడ్‌లు
- వివిధ ఆఫర్లతో ముందుకొస్తున్న యాప్ నిర్వాహకులు

ఖమ్మం సహకారనగర్: గతంలో ఏదైనా దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తే.. చిల్లర లేక దుకాణదారులు, వినియోగదారులు ఇబ్బంది పడేవారు. రాను రాను పరిస్థితుల్లో మార్పులు వచ్చి డిజిటల్ లావాదేవీల వైపు జనం అధికంగా మొగ్గు చూపిస్తున్న పరిస్థితులు నగరంలో కన్పిస్తుంది. సుమారు నాలుగేళ్ల క్రితం నుంచి పెద్ద నోట్ల రద్దు అనంతరం కేంద్ర ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలు జరిపేలా విస్తృత స్థాయిలో ప్రచారం చేయడంతో క్రమక్రమంగా ఆన్‌లైన్ పేమెంట్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

చిరు వ్యాపారుల మొదలు..

రహదారుల వెంట చిరువ్యాపారులు (పండ్ల దుకాణం) నుంచి మొదలు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వరకు క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉంచడంతో డిజిటల్ లావాదేవాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో నగదు చెల్లించగా, ఆ తర్వాత స్వైపింగ్ మిషన్లు వినియోగించేవారు. కొన్ని ప్రాంతాల్లో ఈ పేమెంట్లకు చార్జీలు విధిస్తున్నారనే కోణంలో అనేక మంది వివిధ రకాల యాప్‌ల ద్వారా నగదు చెల్లిస్తున్నారు.


రహదారి వెంట ఏర్పాటు చేసిన స్కానర్

విస్తృత ఆఫర్లు అంటూ ప్రచారం..

కొన్ని రకాల సంస్థలు తమ యాప్‌లను వినియోగించేలా వివిధ రకాల ఆఫర్లను చూపిస్తున్నారు. కొన్ని రకాల కంపెనీలు రూ.100 వరకు కొనుగోలు చేస్తే రివార్డు పాయింట్లు అందిస్తున్నాయి. వాటిని త్వరలో ఉపయోగించే అవకాశం ఉంది. ఈక్రమంలో కొన్ని ప్రైవేట్ ఆన్‌లైన్ సంస్థలు తమ వద్ద వస్తువులను కొనుగోలు చేస్తే ధర తక్కువంటూ సైతం ప్రచారం చేస్తున్నాయి. ఇందులో అధికంగా డిస్కౌంట్ ఆఫర్లు ఇవ్వడంతో ఆన్‌లైన్‌కే మొగ్గు చూపిస్తూ ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా పేమెంట్లు చేస్తున్నారు.

డిజిటల్ లావాదేవీలు అధికం..



వినియోగదారులు పలు రకాల యాప్‌ల ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం చిల్లర ఇబ్బందులు తగ్గాయి. అమౌంట్ పంపాక యాప్‌లో చూసుకుంటే సరిపోతుంది. అయితే నగదు రహిత చెల్లింపులు కావడంతో ఒకటికి రెండు సార్లు చూసుకోవాల్సి వస్తుంది. సమయం ఆదా అవుతుంది.
– ఎస్‌కె.సాజిద్, టీ క్యాంటీన్ నిర్వాహకుడు, ఖమ్మం

సులభంగా ఉంటుంది..



ఏదైనా వస్తువులు కొనుగోలు చేయడానికి ఇబ్బందులు లేకుండా డిజిటల్ పేమెంట్స్ దోహదపడుతున్నాయి. చిల్లర సమస్య కూడా తీరినట్లయింది. గతంలో కొన్ని దుకాణాలకు వెళ్లిన క్రమంలో చిల్లర కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఎక్కువ శాతం నేను ఆన్‌లైన్ పేమెంట్స్ చేస్తుంటాను.
– మేఘన, ఖమ్మం

సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కండి


మాట్లాడుతున్న బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్

ఖమ్మంఅర్బన్: నవతరానికి ఉన్నత సంప్రదాయాలను నిరంతరం అందించాలని, సంఘం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఖమ్మం పీఠం ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ అన్నారు. శనివారం నగరంలోని 2వ డివిజన్ ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో లేటి కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన ఉమ్మడి జిల్లా సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఖమ్మం మేత్రాసనం ద్వారా ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ, బీఈడీ, హెల్త్ సెంటర్లు నిర్వహిస్తున్నామని వీటి ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను నిబద్ధతతో అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌సీఎం సంప్రదాయాలను సంఘ సభ్యులతో పాటు వారి పిల్లలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని, మేత్రాసనం అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం బిషప్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. లేటి కమిటీ బాధ్యులు కొమ్ము ప్రసాద్, ఎం.ప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఫాదర్ స్లీవప్ప, ఏపీ ఆలిండియా క్యాథలిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి, మాంట్‌ఫోర్ట్, బల్లేపల్లి ఫాదర్లు, బ్రదర్లు, సిస్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీ సాహిత్య పురస్కారాలు అందజేత


పురస్కారం అందుకుంటున్న కవి ఆశారాజు

ఖమ్మంగాంధీచౌక్: హాసినీ రామచంద్ర(హెచ్‌ఆర్‌సీ) లిటరరీ ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు తోట సుభాషిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 2024 సంవత్సరానికి గాను ప్రముఖ కవి ఆశారాజుకు సాహిత్య పురస్కారం, సీనియర్ కవి కపిల రామ్‌కుమార్‌కు సాహిత్య గురు పురుస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు మువ్వా శ్రీనివాస్‌రావు, ఆనందాచారి, శిరంశెట్టి కాంతారావు, సురేష్, శేషగిరి, ఉపేందర్, శైలజ, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. శనివారం త్రీటౌన్‌లోని గుమస్తాల సంఘం భవనంలో జరిగిన ప్రజా సంఘాల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేట్ ప్రైవేట్ విధానాలను అమలు చేస్తుందని, దేశ సంపదను పెట్టుబడుదారులకు తాకట్టు పెడుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు యర్రా శ్రీనివాసరావు, భూక్యా శ్రీనివాసరావు, బండారు యాకయ్య, పత్తిపాక నాగసులోచన, శీలం వీరబాబు, ఎస్‌కె బాబు, సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కామేపల్లి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ శనివారం వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్ర తివాచీ పరిచినట్లు..!



సహజ సిద్ధంగా ప్రకృతిలో కనిపించే కొన్ని అందాలు కట్టిపడేస్తాయి. పూలల్లో ఎర్రటి పూలకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ పూలను ఇచ్చే పెద్ద గుల్‌మొహర్ చెట్లు ఇళ్లు, రహదారుల వెంట ఉంటాయి. రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం నుంచి వందనం వెళ్లే రహదారి పక్కనే ఉన్న ఈ చెట్లు పచ్చని ఆకులు, ఎర్రని పూలతో అటుగా వెళ్తున్న ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.
– సాక్షి ఫొటో జర్నలిస్ట్

గురుకుల ప్రిన్సిపాల్‌గా పద్మావతి

నేలకొండపల్లి: స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎం.పద్మావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ప్రమీలా ఉండగా.. ఎర్రుపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న పద్మావతి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా, పద్మావతి ఇదే గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహించారు.

ఎస్‌ఆర్‌కేవీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీరామకృష్ణ విద్యాలయం(ఎస్‌ఆర్‌కేవీ)లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అభయా ఫౌండేషన్ హైదరాబాద్ వారు రీగల్ రెక్నాఫర్డ్ అనే కార్పొరేట్ సంస్థ సౌజన్యంతో ఖమ్మంలోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ వారి ప్రోత్సాహంతో ఈ ల్యాబ్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో బాలచంద్ర, పాఠశాల అధ్యక్షుడు గోంగూర వెంకటేశ్వర్లు(జీవీ), హెచ్‌ఎం సంతోషగౌతం, పాఠశాల కార్యదర్శి శ్రీనివాసరావు, విభాగ్ కార్యదర్శి వేమవరపు సుబ్బారావులతో పాటు అశోక్, అచ్యుత్, యుగేందర్, చరణ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'త్రివేణి'లో హౌస్ ఎలక్షన్స్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ మాదిరిగా హౌస్ ఎలక్షన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపల్ పి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థులను నాలుగు భాగాలుగా విభజించి ఈ సంవత్సరమంతా లీడర్స్, కో – లీడర్స్, ట్రెజరర్ మొదలైన బాధ్యతలు చేపట్టేలా తోటి విద్యార్థులచే ఎన్నికల ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు కాట్రగడ్డ మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బేబీమూన్‌లో ఫుడ్ ఫెస్టివల్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని బేబిమూన్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా వంటకాల మేళా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న, డైరెక్టర్ కేసా భాస్కర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు తాము తయారుచేసిన పలు వంటకాలను ప్రదర్శించగా ఇట్టి కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యంప్రారంభించారు. దీంతో పాఠశాలలో సందడి వాతావారణం చోటుచేసుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్వజ్ఞలో మెహందీ వేడుకలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో శనివారం మెహందీ వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. గోరింటాకు వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణదీప్తి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి డివిజన్ల సమస్యలు


ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ చంద్రకళ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 15వ డివిజన్ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలపై శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లోని అల్లీపురం, కొత్తగూడెం, పుట్టకోట, రుద్రమకోట గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కరెంట్ పోల్స్ లేక తీగలు కిందకు వేలాడడం, వీధి లైట్లు వెలగక వీధులన్నీ చీకటిమయంగా మారాయని వినతిలో పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో పంచాయతీలు విలీనం చేసిన గ్రామాల పరిధిలో నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్, డ్యాకుమెంట్ లేక ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని ఆ సమస్యను పరిష్కరించి అందరికి విద్యుత్ మీటర్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

మంత్రి తుమ్మల నివాళి..

నగరంలోని 14వ డివిజన్ గోపాలపురంకు చెందిన మాజీ వార్డు సభ్యురాలు, కాంగ్రెస్ నాయకురాలు బోడా కాంతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈమేరకు శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మృతురాలి కుమారుడు, కాంగ్రెస్ నాయకుడు బోడా శ్రావణ్, కుటుంబసభ్యులను ఓదార్చి నివాళులర్పించారు. ఆయన వెంట నగర మేయర్ పునకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, కమర్తపు మురళి, తుపాకుల ఎలగొండ స్వామి, మల్లీదు జగన్, నేరెళ్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేయాలని వినతి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ముత్యాలమ్మ గుడి జంక్షన్ నుంచి రిక్కాబజార్ వరకు ఉన్న రోడ్డును 33 అడుగులు వెడల్పు చేయాలని కోరుతూ 25వ డివిజన్ కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అంతేకాక డివిజన్‌లో డ్రెయినేజీ సమస్య కూడా ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రిని కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

చెక్‌డ్యామ్ పనులపై సర్వే షురూ..


సర్వే పనులను ప్రారంభిస్తున్న ఏఈ నరేష్

నేలకొండపల్లి: మండలంలోని కట్టుకాచారాం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న చెక్ డ్యామ్ నిర్మాణానికి సంబంధించి సర్వే పనులను శనివారం ప్రారంభించారు. మండలంలోని కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై రూ.7.50 కోట్లతో నూతనంగా చెక్ డ్యామ్‌ను నిర్మించనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలు మేరకు శనివారం ఇరిగేషన్ ఏఈ టి.నరేష్ సర్వే పనులను ప్రారంభించారు. ఇటీవల ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డిలు వాగును పరిశీలించి చెక్ డ్యామ్ నిర్మించే స్థలాన్ని రైతుల అభిప్రాయాల మేరకు ఎంపిక చేయడంతో స్థలం వద్ద సర్వే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు భూక్యా చంద్రునాయక్ మాట్లాడుతూ.. కట్టుకాచారం గ్రామాల చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతుల ప్రయోజనం కోసం చెక్ డ్యామ్‌ను నిర్మించడం వలన దాదాపు 200 ఎకరాల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులకే కాకుండా గ్రామాలలో భూగర్భజలాలకు చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, రైతులు కోటి అనిల్, ఏటుకూరి పుల్లయ్య, బి.సైదులు, బి.రవి, పీరు, బోయపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో ప'రేషన్'..!

రఘునాథపాలెం: మండలంలోని ఎన్‌వీ బంజర్ గ్రామ పంచాయతీలో రేషన్ దుకాణం లేకపోవడంలో గ్రామస్తులు ప్రతి నెలా పంగిడి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. నిత్యం వ్యవసాయ పనులతో అలసిపోతున్న వారు ప్రతి నెలా వేరే గ్రామానికి వెళ్లి తీసుకురావడం భారంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో కొన్నిసార్లు రేషన్ కోసం వెళ్లలేక వదులుకోవాల్సి వస్తుందన్నారు.ఈ సమస్యపై ఇటీవల కలెక్టర్‌కు సైతం వినతి పత్రం అందించినట్లు గిరిజన సంఘం నాయకుడు చౌహాన్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోనే ఎన్‌వీ బంజర మారుమూల గ్రామ పంచాయతీ అని రేషన్ షాపు లేకపోవడంతో 3 కిలో మీటర్ల దూరంలోని పంగిడి వెళ్లి తీసుకోవాల్సి వస్తుందన్నారు. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసినా.. ఇలాంటి సమస్యలు తీరకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇద్దరు విద్యుత్ ఏఈల బదిలీ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్ పరిధిలో ఇద్దరు అసిస్టెంట్ ఇంజనీర్ల(ఏఈ)ను బదిలీ చేస్తూ టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ తాజాగా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం రూరల్ డివిజన్ పరిధిలోని నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం సెక్షన్ ఏఈ ఎ.బాలాజీని ఖమ్మం ఎంఆర్‌టీ డివిజన్ హెచ్‌టీ మీటర్స్ విభాగం ఏఈగా బదిలీ చేశారు. హెచ్‌టీ మీటర్స్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న నారాయణరావును రాజేశ్వరపురం సెక్షన్ ఏఈగా బదిలీ చేశారు. సీఎండీ కార్యాలయం నుంచి విడుదలైన ఉత్తర్వులను ఖమ్మం సర్కిల్ కార్యాలయం ఎస్‌ఈ ఎ.సురేందర్ ఏఈలకు అందజేయగా.. శనివారం వారు విధుల్లో చేరారు. అయితే రాజేశ్వరపురం సెక్షన్ ఏఈ సేవలపై వినియోగదారులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా సీఎండీ బదిలీ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు


చిన్నారికి వైద్య సేవలందిస్తున్న వైద్యులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని అభయ ఆస్పత్రిలో శనివారం చిన్న పిల్లలకు గుండె సంబంధిత వ్యాధులపై లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి కూరపాటి చిల్డ్రన్స్, అభయ ఆస్పత్రి వైద్యులు పాల్గొని 60 మంది పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజేష్, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ప్రదీప్ కూరపాటి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరాం, కోశాధికారి గోవిందరావు, డాక్టర్ రాఘవరెడ్డి, కూరపాటి వెంకటేశ్వరరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జల్లేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లిలో డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు విజృంభిస్తుండడంతో పొంగులేటి స్వరాజ్యం, రాఘవరెడ్డి (పీఎస్‌ఆర్) ట్రస్ట్ ఆధ్వర్యాన ఖమ్మం కిమ్స్ ఆస్పత్రి వైద్యుల చేత ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఎండీ చావా శివరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ జనరల్ మెడిసిన్ వైద్యులు రంజిత్ రావెళ్ల, ఎం.ఎస్ ఆర్థో రవీంద్రనాథ్ చౌదరి మల్లంపాటి పాల్గొంటారన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మృత్యు 'మలుపు'..!



నగరంలోని గొల్లగూడెం నుంచి చెరుకూరి మామిడితోటకు వెళ్లే దారి మధురానగర్ రోడ్డు నంబర్ 4లో ప్రమాదకర మూలమలుపు ఉంది. అంతేకాక రోడ్డు కూడా ధ్వంసం కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యాన మూలమలుపు వద్ద ఓ ప్లాట్ ఓనర్ తన ప్లాట్‌కు ప్రీకాస్ట్ ఫెన్సింగ్ వేశాడు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా, ఈ రోడ్డులో విన్‌ఫీల్డ్ పాఠశాల ఉండడంతో తల్లిదండ్రులు పిల్లలను దింపేందుకు వచ్చినప్పుడు రోడ్డు రద్దీగా మారుతోంది. ప్రీకాస్ట్ ఫెన్సింగ్ తొలగించి ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. – ఖమ్మం